మన సమగ్ర ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

ప్రజావాణి
ఎప్పడీ వార్తలు
అప్పుడే...

7 PM

ఆదివారం 25 అక్టోబర్ 2026

తెలుగు డైలీ

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

https://epaper.prajavaani.net

## విశాఖకు 870 కి.మీ దూరంలో

# తీవ్ర వాయుగుండం

బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం
దశలవారీగా బలపడి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం
అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే సూచన
గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని అంచనా
మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ప్రభుత్వం హెచ్చరిక



**అమరావతి**

ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది దశలవారీగా బలపడి "అతి తీవ్ర తుపాను"గా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొచ్చే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 28వ తేదీ ఉదయం బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే సూచనలు ఉన్నాయని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలకు - మిగతా3లో



## ఎంతటి లక్ష్యమైనా భారత బలగాలను దాటిపోలేదు

- ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్
- భారత బలగాలకు అందని లక్ష్యం లేదని ఎయిర్ చీఫ్ ఏపీ సింగ్ స్పష్టీకరణ
- 'ఆపరేషన్ సిందూర్'తో ఈ విషయం స్పష్టంగా నిరూపితమైందని వెల్లడి
- స్వదేశీ ఆయుధాల శక్తి ప్రపంచానికి తెలిసివచ్చిందని వ్యాఖ్య
- ఇండో-పసిఫిక్‌లో చైనా కదలికలపై నిరంతర నిఘా ఉంచామన్న ఎయిర్ చీఫ్
- 2047 నాటికి ఐఏఎఫ్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దళంగా మారుతుందని ధీమా

# ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు

- యంత్రాంగం ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి
- 'అర్ణబ్' తుపాను నేపథ్యంలో ఏపీకి హెచ్చరిక
- వచ్చే ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి ఆదేశం
- కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- బుధవారం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటనున్న తుపాను
- ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత విజ్ఞప్తి



**అమరావతి**

ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు పొంచి ఉన్నందున రాష్ట్ర యంత్రాంగం రాబోయే ఐదు రోజుల పాటు పూర్తి అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. రేపటి నుంచి కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. అమరావతిలో మాట్లాడిన మంత్రి అనిత.. తుపాను తీరుతెన్నులను వివరించారు. ఈ తుపాను బుధవారం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు. మంగళ, బుధవారాల్లో వర్షాల తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకరమైన హోర్డింగులను - మిగతా3లో

## తెలంగాణలో మొదలైన

# రైతుల కష్టాలు

ఎల్‌నినో ప్రభావం అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి
ఖరీఫ్ పంట చేతికి వచ్చే కీలక సమ యానికి వర్షాలు లేక, చెరువులు, కుంటలు అడుగంటడంతో నేలలు నెర్రలుబారుతున్నాయి
చేతికొచ్చిన పంట కళ్లెదుటే ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడరాని పాట్లు పడుతున్నారు.



**హైదారాబాద్**

ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో ప్రభావం అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఖరీఫ్ పంట చేతికి వచ్చే కీలక సమ యానికి వర్షాలు లేక, చెరువులు, కుంటలు అడుగంటడంతో నేలలు నెర్రలుబారుతున్నాయి. చేతికొచ్చిన పంట కళ్లెదుటే ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు నిరాశతో పంటలను వదిలేస్తుంటే, మరికొందరు తమ కష్టాన్ని కాపాడుకోవడానికి మానవ ప్రయత్నాలు చేస్తున్నారు. హసన్పర్తి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శ్యాంసుందర్ రెడ్డి అనే రైతు తన 8 ఎకరాల వరి పొలాన్ని కాపాడుకునేందుకు చేసిన సాహసం చర్చనీయాంశమైంది. కరెంట్ లేక, సాగునీరు అందక ఇబ్బంది పడుతున్న ఆయన.. ఏకంగా నాలుగు లారీ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి తన పొలానికి తడి కట్టారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రైతుల దయనీయ పరిస్థితిపై రాజకీయ ప్రకంపనలు రేగడంతో, అధికార యంత్రాంగం హుటాహుటిన స్పందించి ఆ రైతు పొలానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి నీటి కష్టాలు తీర్చింది. మరోవైపు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపు రం మండలం గొల్లపల్లికి చెందిన ప్రవీణ్ అనే యువరైతు తన ఆవేదనను వెల్లగక్కాడు. పూర్తిగా ఎండిపోయిన తన పంట పొలంలో బైక్‌పై తిరుగుతూ.. తాను పెట్టిన పెట్టుబడి, పడ్డ శ్రమ అంతా బూడిదైపోయిందని కన్నీరుమున్నీరయ్యాడు. నీరు లేక అల్లాడుతున్న రైతులకు రాజకీయ - మిగతా3లో

## రాహుల్‌గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారింది

- రేవంత్ రెడ్డి ఒక కార్డులాగా పనిచేస్తుంటే..
- కాంగ్రెస్ పార్టీ ప్రజల సొమ్మును దోచుకుంటోంది
- 2023 ఎన్నికలకు ముందు తెలంగాణలో గెలిచేందుకు రాహుల్ గాంధీ 420 వాగ్దానాలు చేశారు
- వీటిలో 6 గ్యారంటీలు, 13 డిక్లరేషన్లున్నాయి..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



**హైదారాబాద్**

రాహుల్ గాంధీ భారతదేశంలోనే అతిపెద్ద అబద్ధాలకోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు ఖైరతాబాద్ యువ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిబ్రాన్ షరీఫ్‌కు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 2023 ఎన్నికలకు ముందు తెలంగాణలో గెలిచేందుకు రాహుల్ గాంధీ 420 వాగ్దానాలు చేశారు. వీటిలో 6 గ్యారంటీలు, 13 డిక్లరేషన్లున్నాయి.. - మిగతా3లో

## ఇప్పుడు స్థానిక ఎన్నికల పేరుమీద జరుగుతున్నది

# గ్యాంగ్ వార్ మాత్రమే



రెండు కుటుంబాలకు చెందిన గ్యాంగులు రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాయన్న విజయసాయి
అధికార పార్టీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు నామినేషన్లు చించేస్తున్నారని ఆరోపణ
2021 నాటి వైసీపీ అరాచకం కంటే పదింతల అరాచకం ఇప్పుడుందని విమర్శలు
రాష్ట్ర అభివృద్ధికి మూడో రాజకీయ ప్రత్యామ్నాయమే పరిష్కారమని పునరుద్ఘాటన

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో జరుగుతున్నది ఎన్నికలు కాదని, కేవలం గ్యాంగ్ వార్ మాత్రమేనని ఆయన ధ్వజమెత్తారు. రెండు కుటుంబాలకు చెందిన గ్యాంగులు రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల - మిగతా3లో

## భారత్-పాక్ మ్యాచ్‌లు క్రీడ కాదు.. రాజకీయ వ్యవహారం



## రాహుల్ విదేశీ పర్యటనలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే

- రాహుల్‌పై పీవీ మనవడు ఎన్వీ సుభాష్ విమర్శలు
- విదేశీ పర్యటనల్లో రాహుల్ రాజ్యాంగ సంస్థలను కించపరుస్తున్నారన్న సుభాష్
- ఎన్నికల్లో ఓటమి ఖాయమనే ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శలు
- కొన్ని వర్గాలను రెచ్చగొట్టి రాజకీయ మనుగడ కోసం చూస్తున్నారని వ్యాఖ్యలు



ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ఆదివారం 25 అక్టోబర్ 2026

# ఎంతటి లక్ష్యమైనా భారత బలగాలను దాటిపోలేదు



భారత సాయుధ దళాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని, ఏ శత్రువైనా, ఏ ప్రాంతమైనా మన బలగాల పరిధిలోనే ఉందని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్పష్టం చేశారు. గతేడాది పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ఈ విషయాన్ని ప్రపంచానికి స్పష్టంగా నిరూపించిందని ఆయన అన్నారు. అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో పీటీఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్‌తో భారత వాయుసేన (ఐఏఎఫ్) వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ తీసిందని ఆయన వివరించారు.

గతేడాది మే నెలలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టామని ఏపీ సింగ్ గుర్తుచేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 1,200 కిలోమీటర్ల వెడల్పు, 200 కిలోమీటర్ల లోతు వరకు విస్తరించి ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై నిర్దిష్ట దాడులు చేశామని తెలిపారు. ఈ దాడుల ద్వారా ఏ ప్రదేశమైనా ఐఏఎఫ్ పరిధికి అతీతం కాదని తేల్చిచెప్పినట్లు అయిందన్నారు. ఆపరేషన్‌లో ఒక్క సామాన్య పౌరుడికి కూడా హాని కలగకుండా 'జీరో కొలేటరల్ డ్యామేజ్' సూత్రాన్ని కచ్చితంగా పాటించామని ఆయన గర్వంగా చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడం వెనుక కేవలం ఒక ఆయుధం లేదా ఒక విమానం మాత్రమే లేదని, కచ్చితమైన ఇంటెలిజెన్స్, నెట్‌వర్క్డ్ ఆపరేషన్స్, స్టాండ్-ఆఫ్ ఆయుధాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, బహుళ-స్థాయి గగనతల రక్షణ వ్యవస్థల సమన్వయం ఉందని ఏపీ సింగ్ విశ్లేషించారు. ముఖ్యంగా, పాకిస్థాన్ సైన్యం ప్రయోగించిన డ్రోన్లు, ఇతర ఆయుధాలను మన స్వదేశీ గగనతల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా ఎదుర్కొందని అన్నారు. ఈ ఆపరేషన్‌లో కొన్ని స్వదేశీ ఆయుధ వ్యవస్థలు అద్భుతంగా పనిచేసి, శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి పెను నష్టాన్ని కలిగించాయని తెలిపారు. స్వదేశీ ఉత్పత్తి రక్షణ రంగాన్ని ఆధునికీకరించడమే కాకుండా, భారతదేశ వ్యూహాత్మక స్వావలంబనను బలోపేతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారతదేశ సామర్థ్యాలను ప్రదర్శించడం జాతీయ భద్రతకు చాలా కీలకమని ఎయిర్ చీఫ్ మార్షల్ అభిప్రాయపడ్డారు. ఆ వనరులు అధికంగా ఉండే ప్రాంతంలో చైనా సైనిక విస్తరణపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెరుగుతోందని, ఈ నేపథ్యంలో భారత వాయుసేన పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటానికి క్వాడ్ భాగస్వాములైన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కలిసి భారత్ పనిచేస్తోందని తెలిపారు. ఇటీవల ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్‌లలో ఐఏఎఫ్ జరిపిన విన్యాసాలు సుదూర, సముద్ర గగనతల కార్యకలాపాలలో అమూల్యమైన అనుభవాన్ని అందించాయని ఆయన వివరించారు. 'వికసిత భారత్ 2047' జాతీయ దార్శనికతకు అనుగుణంగా ఐఏఎఫ్ దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నాయని ఏపీ సింగ్ తెలిపారు. 2047 నాటికి భారత వాయుసేనను ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన, వినూత్నమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన బహుళ-డొమైన్ ఏరోస్పేస్ శక్తిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి రక్షణ, భద్రత పునాదులని, ఆ లక్ష్య సాధనలో ఐఏఎఫ్ తన పూర్తి పాత్రను పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రూ.500 కోట్ల ఆడియో కలకలం.. మహారాష్ట్ర మిత్రపక్షాల్లో మాటల మంటలు!



మహారాష్ట్ర అధికార కూటమిలో ఓ ఆడియో క్లిప్ తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత మనోజ్ జారంగే పాటిల్‌కు, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి రూ. 500 కోట్లు అందినట్లు ఆరోపణలు రావడంతో మిత్రపక్షాలైన బీజేపీ, ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ డబ్బును ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడైన ఎంపీ శ్రీకాంత్ షిండే ద్వారా చేరవేశారని ఆ ఆడియోలో ఉండటం వివాదాన్ని మరింత రాజేసింది. గురువారం జాల్నాలో జరిగిన ప్రెస్ మీట్‌లో మనోజ్ జారంగే పాటిల్ ఈ ఆడియో క్లిప్‌ను బయటపెట్టారు. అందులో గుర్తు తెలియని మహిళ మాట్లాడుతూ 'శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే ద్వారా బీజేపీ పంపిన రూ. 500 కోట్లు ఆయనకు అందాయి' అని పేర్కొంది. అయితే, దీనిని జారంగే ఖండించారు. తాను ఎలాంటి డబ్బు తీసుకోలేదని స్పష్టం చేశారు. తనను గానీ, మరాఠా ఉద్యమాన్ని గానీ అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ క్లిప్ సృష్టించారని ఆరోపించారు. ఈ ఆడియో క్లిప్ ప్రామాణికత ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ ఆరోపణలను ఏక్‌నాథ్ షిండే, శ్రీకాంత్ షిండే తీవ్రంగా ఖండించారు. "నేను 500 కోట్లు ఇవ్వలేదు, తీసుకోలేదు" అని ఉప ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. మరోవైపు, శ్రీకాంత్ షిండే వ్యంగ్యంగా స్పందిస్తూ.. అంత పెద్ద మొత్తంలో డబ్బు ఎక్కడుందో తానే వెతుకుతున్నానని, అంత భారీ నగదును తరలించడం ఎంత కష్టమో ఆలోచించాలని అన్నారు. ఈ వివాదం మరో మలుపు తీసుకుంది. శివసేన సీనియర్ నేత రామ్‌దాస్ కదమ్ సంచలన ఆరోపణలు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను రాజకీయంగా దెబ్బతీసేందుకు బీజేపీలోని కొందరు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్సీలు ప్రవీణ్ దారేకర్, ప్రసాద్ లాడ్‌లను ప్రస్తావిస్తూ, జారంగే పాటిల్‌తో లాడ్ ఉన్న ఫొటోలను ప్రదర్శించారు. అయితే, బీజేపీ నేతలు ఈ ఆరోపణలను ఖండించారు. వివాదం ముదరడంతో శివసేన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసింది. అనంతరం, ఫడ్నవీస్ ఈ ఆడియో క్లిప్‌పై ఫోరెన్సిక్ విచారణకు ఆదేశించారు. మరోవైపు, ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు శివసేన లేఖ రాసింది. ప్రస్తుతం ఇరుపక్షాల నేతలు వివాదాన్ని చల్లార్చే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఈ ఘటన మహాయుతి కూటమిలోని అంతర్గత విభేదాలను మరోసారి బయటపెట్టింది.

# ఎన్నికల బరిలో దూసుకెళ్తున్న దారపనేని రామలింగ

## 21వ వార్డులో విస్తృత ప్రచారం.. ప్రజాసేవే తన లక్ష్యమన్న దారపనేని.





**పెనుకొండ** నగరపాలక ఎన్నికల నైపథ్యంలో 21 వవార్డు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి దారపనేని రామలింగ ఎన్నికల ప్రచా రంలో ముందుకు సాగుతున్నారు.కోనాపురంలో వ్యవసాయం చేసుకుంటూ,ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నారు.21వ వార్డు అభివృద్ధే లక్ష్యం గా ప్రజలను కలుస్తూ తన అభ్యర్థిత్వాన్ని తెలియజేస్తున్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజల సమస్య ల పరిస్కారానికి కృషి చేయానే సంకల్పం తో మంత్రి సవిత చొరవ తో ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు తెలిపారు.

**వార్డు అభివృద్ధే లక్ష్యం**

2024 ఎన్నికల్లో మంత్రి సవిత గెలుపు కోసం కృషి చేశాను. వార్డు లో సమస్య ల పరిష్కారం కోసం కృషి చేశాను.వార్డు లో రోడ్ల సమస్య లను గుర్తించాం.అవసరమైన ప్రాంతాల్లో నూతన రహదారుల నిర్మిణానికి కృషి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు.వార్డు లో ప్రజల అవసరాలను గుర్తించి డ్రైనేజీలు, రహదారులు,వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పన కు కృషి చేస్తానన్నారు.ప్రజల నుంచి వచ్చే సమస్య లు స్వీకరించి మంత్రి సవిత దృష్టి కి తీసుకెళ్లి మంత్రి చొరవతో సమస్య లు పరిష్కారించేందుకు దారపనేని రామలింగ కృషి చేస్తానన్నారు.

**టీడీపీతో అనుబంధం.**

కుటుంబం అంతా టీడీపీ కి అనుబంధంగా ఉన్నామని, పార్టీ సిద్దాంతాలకు కట్టుబడి పని చేస్తున్నానని తెలిపారు.టిడిపి తో చాల అనుబంధం ఉందని అయితే ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యం తో ముందుకు సాగుతున్నానన్నారు.పురపాలకలో 21వ వార్డు లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించి న మంత్రి సవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రజల దీవెనలతో గెలుస్తాం.**

గత ప్రభుత్వంలో పోటి చేసి ఓడినా పార్టీ ని అధికారం లోకి తెవడాని కృషి చేశానన్నారు. అలాగే మంత్రి సవిత గెలుపుకోసం కష్టపడి పనిచేశానన్నారు. మంత్రి సవిత దీవెనలు,ప్రజల మద్దతుతో, గెలిచి వార్డును అభివృద్ధి లోకి తెస్తానన్నారు.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని సమస్యల పరిష్కార దిశగా పని చేస్తానని దారపనేని రామలింగ అన్నారు.

## విశాఖకు 870 కి.మీ దూరంలో తీవ్ర వాయుగుండం

-మొదటిపేజీ తరువాయి

ఆరెంజ్ మెసేజ్ జారీ చేసింది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీచే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం ఉదయం 11:30 గంటల సమయానికి ఈ తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 870 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 960 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. అదేవిధంగా, మచిలీపట్నానికి 1,060 కిలోమీటర్లు, బాపట్లకు 1,130 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం గంటకు 5 కిలోమీటర్ల నెమ్మది వేగంతో నైరుతి దిశగా కదులుతున్న ఈ వ్యవస్థ, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి తుపానుగా మారనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ తుపాను అక్టోబర్ 27 ఉదయానికి తీవ్ర తుపానుగా, అక్టోబర్ 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి, ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి రానుంది. అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నంలోపు బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకే ప్రమాదం ఉందని హెచ్చరి స్తున్నారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, ముఖ్యంగా తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వేటకు వెళ్లిన వారుంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని కోరింది. "బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్తగా కట్టి ఉంచాలి. సముద్ర తీరాల్లో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, బీచ్‌ల వద్ద సెల్ఫీలు దిగే ప్రయత్నం చేయరాదు" అని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. తుపాను కదలికలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని, ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. తీరప్రాంత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రాహుల్ విదేశీ పర్యటనలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. తన విదేశీ పర్యటనల ద్వారా భారతదేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరిచేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి, మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు మనవడు ఎన్వీ సుభాష్ ఆరోపించారు. నేడు ఆయన మాట్లాడుతూ.. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. "రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లినప్పుడల్లా, ఆయన చుట్టూ ఉన్న ఎకోసిస్టమ్‌లో ఏదో మార్పు వస్తుంది. ప్రతిపక్ష నేతగా ఆయన నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు, కానీ దానికి బదులుగా రాజ్యాంగం, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ వంటి వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఏదో ఒకరోజు వారు మీడియాపై కూడా వ్యాఖ్యలు చేస్తారు. ఆయన విదేశాలకు వెళ్లి ఇక్కడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు" అని సుభాష్ అన్నారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేత దేశంలోనే ఉండి, పార్టీ కార్యకర్తలతో, ప్రజలతో మమేకం కావాలని ఆయన సూచించారు. "విదేశాల నుంచి తిరిగి వచ్చాక, ఏమాత్రం సంబంధం లేని విషయాలు మాట్లాడుతూ కొన్ని వర్గాల ప్రజలను రెచ్చగొడుతున్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఆయన ఓటముల సెంచరీ కొట్టడం ఖాయం" అని ఎద్దేవా చేశారు. రాజకీయ మనుగడ కోసం రాహుల్ గాంధీ మతపరమైన, సామాజికపరమైన సున్నితమైన అంశాలను రెచ్చగొడుతున్నారని, ఇది ఆందోళన కలిగించే విషయమని సుభాష్ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం ఖాయమని తెలిసే, ఓటమికి సాకులు సిద్ధం చేసుకుంటున్నారని ఆరోపించారు. "ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈవీఎంల వలనో, ఇతర కారణాల వలనో ఓడిపోయామని చెప్పడానికి ఆయన ఇప్పటినుంచే పునాదులు వేస్తున్నారు" అని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన గొప్ప ప్రతిపక్ష నేతల మాదిరిగా రాహుల్ గాంధీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సుభాష్ డిమాండ్ చేశారు. "రాహుల్ గాంధీ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా మెలగాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఆయన పూర్వీకులు ఈ దేశాన్ని పాలించారు. కానీ వారెవరూ ఇలా ప్రవర్తించలేదు" అని సుభాష్ వ్యాఖ్యానించారు.

## ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు..

-మొదటిపేజీ తరువాయి

వెంటనే తొలగించాలని, తీరప్రాంత ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, పర్యాటకులను బీచ్‌లకు అనుమతించవద్దని స్పష్టం చేశారు. రైతులు, సాధారణ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి విజ్ఞప్తి చేశారు. సముద్రపు అలల వద్ద సెల్ఫీలు వంటి సాహసాలు చేయవద్దని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, కేవలం విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు.

## రాహుల్‌గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారింది

-మొదటిపేజీ తరువాయి

వీటిని 100 రోజుల్లోగా నెరవేర్చాల్సి ఉంది.. కానీ 1,000 రోజులు గడిచినా ఒక్క వాగ్దానం కూడా నెరవేరలేదన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రజల ముందు రావడానికి భయపడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం రాహుల్ గాంధీ ఒక ఏటీఎం లాగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి ఒక కార్డులాగా పనిచేస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ ప్రజల సొమ్మును దోచుకుంటోందని, రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, కార్తకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఇప్పుడు స్థానిక ఎన్నికల పేరుమీద జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల పేరుమీద జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే. బీహార్‌ను మించి పోయి, రెండు కుటుంబాలకు చెందిన ఒక హిందూ కుల గ్యాంగ్, మరో మైనారిటీ మతానికి చెందిన గ్యాంగ్‌లు మన రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నాయి" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు కుటుంబ గ్యాంగులకు అధికారం దక్కకుండా చేస్తే తప్ప ఏపీలో ప్రజలకు రక్షణ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి అభివృద్ధి కేవలం మూడవ ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ వలనే సాధ్యమవుతుందని, అదే ఏపీకి శరణ్యమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "అధికార పార్టీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు.. ఈ ముగ్గురు కలిసి ఒక కూటమిగా ఏర్పడి, స్థానిక ఎన్నికల్లో పోటీపడి నామినేషన్లు చించేస్తున్నారు" అని విమర్శించారు. 2021లో వైసీపీ చేసిన అరాచకం కంటే పదింతలు ఎక్కువ అరాచకం ఈ రోజు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణలో మొదలైన రైతుల కష్టాలు

-మొదటిపేజీ తరువాయి

నాయకుల విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.